క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

మే డేని జయప్రదం చేయండి

వేంపల్లె : ప్రతి కార్మికుడు 139వ మే డేని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భవన నిర్మాణ కార్యాలయంలో కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని మన ఐక్యతను ప్రభుత్వాలకు తెలిసేలా జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అంకాలమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో అంకాలమ్మ తిరునాల ఆదివారం ఘనంగా ముగిసింది. ఈనెల 17న ప్రారంభమైన తిరునాల మహోత్సవం ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని పులివెందుల జెఎఫ్‌సీ ఎం.చంద్రశేఖరెడ్డి దంపతులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.

విజేతలకు బహుమతుల ప్రధానం


షటిల్ టోర్నమెంట్ విజేతలు

వేంపల్లె : వేసవి సెలవుల నేపథ్యంలో పట్టణంలో ఆదివారం నాగశెట్టి సునీల్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక పట్టణ సమీపంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ షటిల్ టోర్నమెంట్ జరిగింది. తాలూకా స్థాయి నుంచి 20 జట్లు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని పులివెందుల నాయక్ టీం, రెండో బహుమతి వేంపల్లి మనీ టీం, మూడో బహుమతి మారుతి టీం గెలుచుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులతో పాటు ప్రైజ్ మనీ ప్రధానం చేశారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : ప్రాథమిక హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్‌హెచ్‌ఆర్‌పీసీఐఎల్ చైర్మన్ జీపీ నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సభ్యులతో కలసి ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక హక్కుల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఆయన సూచించారు.

బసిరెడ్డి విలక్షణమైన నాయకుడు

కడప కల్చరల్: రాజకీయాల్లో నైతిక విలువలు పాటించిన పెంచికల బసిరెడ్డి విలక్షణమైన నాయకుడిగా గుర్తింపు పొందారని హైకోర్టు న్యాయవాది పి.రఘునాథరెడ్డి అన్నారు. దివంగత పెంచికల బసిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం కడప నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ మూడుమార్లు పులివెందుల ఎమ్మెల్యేగా, జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా, రెండు మార్లు రాష్ట్ర మంత్రిగా పెంచికల బసిరెడ్డి తన ప్రతిభ చాటుకున్నారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ గొప్ప నాయకుడైన బసిరెడ్డి విగ్రహం వద్ద ఆయన పేరుతో బసిరెడ్డి సర్కిల్ అని నామకరణం చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు.

గొంతులు ఎండుతున్నాయ్..

చక్రాయపేట : వేసవితో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. నీటి కోసం జనం ఎక్కడుంటే అక్కడికి పరుగులు తీస్తూ అవస్థలు పడుతున్నారు. మండలంలోని చిలేకాంపల్లె దళితవాడలో నీటి ఎద్దడి నెలకొంది. ఇక్కడ బోరులో నీటిని బిందెల్లోకి నింపుకొనేందుకు మహిళలు పోటీలు పడుతూ నేను ముందంటే నేను ముందు అంటూ గొడవలు పడుతున్నారు. కొందరైతే మోటారు సైకిళ్లతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి రైతులను బంగపడి నీళ్లు తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. కల్లూరుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిద్దు కుంటపల్లెలో ప్రజలకు నీటి సమస్య తీర్చాలని నెల రోజుల క్రితం బోరు వేశారు. అయితే దానికి మోటారు బిగించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండా, గరుగుతాండాల్లోనూ పరిస్థితి అలాగే ఉంది. బీఎన్ తాండాకు సుమారు రెండు కి.మీ దూరంలో అధికారులు బోరు వేయించారు. కాని మోటారు పైపు లైన్లు వేయించలేదు. దీనికి తోడు అక్కడికి విద్యుత్ లైన్‌లు కూడా లేక పోవడంతో వేసిన బోరు నిరుపయోగంగా మారింది. చక్రాయపేట గ్రామంలో బ్యాంకులు, ఉన్న ప్రాంతంలో నీల్లు రాక ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా అవి చాలడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే గరుగుతాండా, కాట్లగంటివారిపల్లె, దళితవాడ, మహబూబ్‌నగర్, లక్ష్మీపురం, బోడుగుండు పల్లె, గడ్డంవారిపల్లె, మద్దికవాండ్లపల్లె, మూలపల్లె తదితర గ్రామాల్లో నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల రైతులతో వప్పందం కుదుర్చుకుని నీటిని అందిస్తున్నారు.


చిలేకాంపల్లె దళితవాడలో అరకొర నీటి కోసం మహిళల పాట్లు

మూగజీవాల పరిస్థితి ఆగమ్య గోచరం

మనుషులు పరిస్థితి ఇలా ఉంటే మూగజీవాల దుస్థితి ఆగమ్య గోచరంగా ఉంటోంది. కడుపుకు సరి పడా మేత లేకున్నా తాగేందుకు కూడా నీళ్లులేక అవస్థలు పడుతున్నాయి. అడవికి మేతకు వెళ్లిన పశువులు కాళ్లరిగేలా తిరిగి అరకొరగా కడుపు నింపుకుని నీటికోసం ఎండకు నాలుకలు చాస్తూ ఇళ్లకు పరుగులు తీస్తున్నాయి. కడుపు నిండుగా నీరు కూడా అందించ లేక పోతున్నామని వాటి యజమానులు అంటున్నారు. ప్రభుత్వం ట్యాంకర్లతో సరఫరా చేసే నీళ్లు చాలడంలేదని మరిన్ని ట్యాంకర్ల నీటిని అందించి దాహార్తిని తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.


దిద్దుకుంటపల్లె వద్ద మోటారు బిగించకుండా వదిలేసిన కొత్త బోరు

ఇన్ని పాట్లు ఎప్పుడూ పడలేదు



చీకట్లో లేచి ఉపాధి పనికి పోవాలా.. పనికి పోక పోతే పొయ్యి మండదు. ఎండకు ఇంటికి రాగానే నీళ్ల కోసం పరిగెత్తాల. ఊర్లో వచ్చే కొన్ని నీళ్లకు ఆడోల్లు కొట్లాడుతుంటే వాళ్లను అరుస్తూ మొగోల్లందరూ రైతుల తోటల కాడికి పోయి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. జీవాలు ఉన్న వాళ్ల పరిస్థితి చూస్తే కడుపులో బాదేస్తోంది. నాలుక చాచి అరుచుకుంటూ ఇంటికి వచ్చిన జీవాలకు కూడా నీల్లు పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

– పోరి అంజనేయులు, చిలేకాంపల్లె దళితవాడ.

నెల రోజుల నుంచి మొత్తుకుంటున్నా..



మావూర్లో బోరు వేసి నెల రోజులు అవుతోంది. ఇప్పటి వరకు దానికి మోటరు బిగించలేదు. నీల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మొత్తుకుంటున్నా పట్టించు కునే వారు లేరు. డీఈకి ఫోన్ చేస్తే మూడు రోజుల్లోపు బిగిస్తామన్నారే ఇంకా బిగించ లేదా అని అంటున్నారు. త్వరలోనే బిగించేటట్లు చూస్తా మంటున్నారు. ఎప్పుడు బిగిస్తారో ఏమోకాని ఇక్కడ జనాలకు ఇబ్బందులు మాత్రం తప్పలేదు.

– రామ భద్రప్ప నాయుడు, దిద్దుకుంటపల్లె.

హేలాంబకు ప్రత్యేక పూజలు

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ (హేలాంబ) అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తిరునాల మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. రాత్రి ప్రొద్దుటూరుకు చెందిన నృత్య తరంగిణి శ్రవణ్ బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం భక్తులను ఆకట్టుకుంది.

నేడు రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు

కమలాపురం : ఎల్లమ్మ(హేలాంబ) తిరునాల మహోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ క్యాటగిరి వృషభ రాజములచే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. మొదటి బహుమతి రూ.1.20 లక్షలు, రూ.లక్ష, రూ.80 వేలు, రూ.60వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు ఆలయ ప్రాంగణంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం రాత్రి నాటకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పహల్గామ్ మృతులకు సంఘీభావం


నివాళులర్పిస్తున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు రింగురోడ్డు సర్కిల్ వద్ద ఆదివారం 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో పహల్గామ్ మృతులకు సంఘీభావంగా క్యాండిల్ ర్యాలీలో భగతసింగ్‌నగర్ వాసులు ర్యాలీ నిర్వహించి వారికి నివాళి అర్పించారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తున్న ట్రాన్స్‌కో అధికారి

పెండ్లిమర్రి : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నందిమండలం విద్యుత్ సబ్ స్టేషన్‌లో గతంలో ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈఈలు వెంకటేశ్వర్లు, సుబ్బారావు ఏఈలు నవనీత, భరత్, వీరయ్య, ఇంజనీర్ నాయక్ పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో రక్తదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఎంఎం.హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహబూబ్ బీకి అత్యవసర చికిత్స నిమిత్తం బి.పాజిటివ్ రక్తం ఇచ్చి ఖాన్ కరిస్మా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తారిక్ అలీ మానవత్వం చాటారు. తాను ఇప్పటి వరకూ 49 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, షబ్బీర్, రాము, బెనర్జీ పాల్గొన్నారు.

వాడ వాడలా సేవా కార్యక్రమాలు

పులివెందుల రూరల్/టౌన్ : వైఎస్ అభిషేక్‌రెడ్డి 38వ జయంతి సందర్భంగా ఆదివారం వాడ వావలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు గంగాధరరెడ్డిలు నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. వైఎస్ అభిషేక్‌రెడ్డి చిన్న వయస్సులో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన వైఎస్సార్ పార్టీకి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, చంద్రమౌళి, మస్తాన్, కనక, ఎంపీటీసీ విశ్వనాథ్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, అర్జున్‌రెడ్డి, కౌన్సిలర్ భార్గవి, వీణా, చలపతి, హరినాథ్, వీరారెడ్డి, కోళ్లభాస్కర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రజక కాలనీలో వృద్ధ మహిళలకు కౌన్సిలర్ కోడి రమణ, మార్కెట్ మాజీ చైర్మన్ చిన్నప్పలు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. అలాగే మదర్సాలా కో ఆప్షన్ మెంబర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను, వైఎస్ అభిషేక్‌రెడ్డి భార్య వైఎస్ సౌక్యారెడ్డి, కుమార్తెలు అక్షర, ఆకర్షలతో పాటు తమ్ముడు వైఎస్ అభినవరెడ్డి కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో, గంగిరెడ్డి ఆసుపత్రిలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్తీక్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాదురెడ్డి, సురేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో అంధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. లీలావతి వృద్ధాశ్రమంలో వాటర్‌ప్లాంట్ వీరారెడ్డి, రామలక్ష్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నగరిగుట్టలోని ఆశ్రమంలో చిన్నప్ప, కోడి రమణ ఆధ్వర్యంలో ప్లేట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గాంధీ సర్కిల్ వద్ద కోలా ప్రసాదు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. తుమ్మలపల్లెలో ఎంపీటీసీ విశ్వనాథ్‌రెడ్డి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అలాగే సర్పంచు గజ్జల అనూషా, మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో తల్లి మాదవిలత, భార్య సౌక్యారెడ్డిలు వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.


పాత ఎమ్మెల్యే కార్యా లయం వద్ద కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహరరెడ్డి, వైఎస్ మధురెడ్డి తదితరులు

వేములలో..

వేముల : వేల్పుల గ్రామంలో మండల పరిశీలకుడు వేల్పుల రామలింగారెడ్డి జిల్లా, గ్రంథాలయ మాజీ చైర్ పర్సన్ లింగాల ఉషారాణిల ఆధ్వర్యంలో వైఎస్ సౌక్యారెడ్డి, అక్షర, ఆకర్షలతో పాటు వైఎస్ అభినవరెడ్డి హాజరై అభిషేక్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. వికలాంగులకు, మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పులివెందుల నియోజకవర్గ అధ్యోక్షుడు భాస్కర్, ఎంపీటీసీ బాబ్‌జాన్, వైఎస్సార్ సీపీ నాయకులు హజరయ్యారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పార్టీ జిల్లా కార్యదర్శి నీలవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ జాఫర్, మండల కో ఆర్డినేటర్ నజీర్, అబ్దుల్ కలామ్, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : గండిక్షేత్రంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు తాటిగొట్ల శివప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బందలకుంట ఈశ్వరరెడ్డి, ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ లోమడ రామాంజులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గఫూర్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు రాంబాబు, నేతలు శ్రీనివాసులు, గంగయ్య, ప్రతాప్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక రాజీవ్ కాలనీలోని అమ్మ అనాథశరణాలయంలో వృద్ధులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హేమాద్రిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ఇప్పట్లలోని లీలావతి వృద్ధాశ్రమంలో వైఎస్ఆర్సీపీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇరిగిరెడ్డి వీరారెడ్డి, పులివెందుల నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ రామ్‌లక్ష్మణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ అభినవ్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్పలు పాల్గొని కేక్ కట్‌చేసి వృద్ధులకు అందించారు. వైఎస్సార్ సీపీ నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మాజీ కౌన్సిలర్ నూరుల్లా, రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ షమీముల్లా, వైఎస్ఆర్సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్, నాయకులు ఈశ్వరయ్య, చలపతి, రఫీ, హర్షద్, చంద్ర,బాషా, ఫక్రుదిన్ తదితరులు పాల్గొన్నారు .

తొండూరులో..

తొండూరు : గంగాదేవిపల్లె క్రాస్‌రోడ్డులో వైఎస్సార్ సీపీ నాయకులు శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సౌఖ్యారెడ్డి, వైఎస్ అభినవ్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి దివ్యాంగులకు అందించారు. డాక్టర్ సౌఖ్యారెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో తన భర్త మరణించినా పులివెందుల నియోజకవర్గ ప్రజల ఆదరా భిమానాలు, అండదండలతో ఆయన చూపిన బాటలో ప్రజా సేవకు పునరంకితమవుతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి నిత్యవసర సరుకులను దివ్యాంగులకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, మాజీ డైరక్టర్లు సైదాపురం సురేష్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భద్రంపల్లె వెంకటరామిరెడ్డి, బాలగంగిరెడ్డి, గంగిరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మిరెడ్డి, రమేష్, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వరెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, రామాంజులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్ అభిషేక్ రెడ్డి భార్య సౌక్యారెడ్డి, కుమార్తెలు తదితరులు


వేములలో వికలాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్ సౌక్యారెడ్డి, ఉషారాణి


గండిలో అన్నదానం చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు


వేంపల్లెలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సింహాద్రిపురంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


తొండూరులో కేక్‌ను కట్‌చేస్తున్న వైఎస్ సౌఖ్యారెడ్డి, వైఎస్ అభినవ్‌రెడ్డి తదితరులు

రోడ్డు భద్రతానియమాలు పాటించాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతానియమాలు పాటించాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, సరైన పత్రాలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రయాణాల్లో బాధ్యత రాహిత్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలని, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయవద్దని, నిభందనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు భద్రతా నియమాలు వివరిస్తున్న సీఐ నరసింహులు

29న శివపార్వతుల కల్యాణోత్సవం

వల్లూరు : పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలోని చింతలపత్తూరు శ్రీ ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెంచు సుబ్రమణ్యంస్వామి తెలిపారు. 28వ తేదీన వైశాఖ శుద్ధ పాడ్యమి సోమవారం ఉదయం గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనము, మంటపారాధన, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, మహానైవేద్యం, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమం, గణపతి, లక్ష్మీనారాయణ తదితర హోమాలు జరుగుతాయి. 29న వైశాఖ శుద్ధ విదియ మంగళవారం ఉదయ ప్రాతఃకాలపూజ, దీక్షాహోమం, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం శివపార్వతుల కల్యాణ జరుగుతుంది. అనంతరం మహానైవేద్యం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుంది. సాయంత్రం శివ సహస్రనామార్చన, పుష్పయాగం, పుష్పాలంకార సేవ, మహామంగళహారతి, మంత్రపుష్పం జరుగుతుంది. 30న వైశాఖ శుద్ధ తదియ అక్షయతృతీయ, బుధవారం ఉదయం ప్రాతఃకాలపూజ, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేచనం, విభూత్యలంకార సేవ, నవగ్రహ, శివపంచాయతన మూలమంత్ర, శ్రీరుద్ర హోమాలు, మహా పూర్ణాహుతి, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, కలశోద్వాసనము, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు.

నేడు పాలిటెక్నిక్ కాలేజిలో మాక్ టెస్టు

జమ్మలమడుగు : ఈనెల 30వ తేదీన జరిగే పాలిసెట్ పరీక్షలకు సంబంధించి మాక్ టెస్టు నిర్వహిస్తున్నట్లు కాలేజి ప్రిన్సిపాల్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నికల్ ఎంట్రెన్స్ పరీక్షల కోసం పదవ తరగతి విద్యార్థులకు గత నెల రోజుల నుంచి కోచింగ్ ఇచ్చారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్టులు ఏవిధంగా రాయాలన్న దానిపై పూర్తి అవగాహన కోసం మాక్ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు ముద్దనూరు రోడ్డులో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీకి రావడానికి పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాల వద్ద ఉదయం 8:30 నిమిషాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు.

'బ్రౌన్'లో నిర్మాణానికి శంకుస్థాపన నేడు

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అదనపు భవనాలకు మంగళవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత కార్యక్రమానికి హాజరై శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.